# చూడుచూడు రుచులు

-పాలెపు బుచ్చిరాజు

సమ్మర్ హాలీడేస్‌కి పుట్టింటికొచ్చిన సరళ తిరుగు ప్రయాణానికి సన్నద్ధమౌతోంది. ఆరోజు ప్రొద్దుటే కాఫీ, టిఫిన్లు కానిచ్చి హైదరాబాదు భర్తకి ఫోను చేసింది, పిల్లలూ, తనూ రెండు రోజుల్లో బయల్దేరి వచ్చేస్తున్నామని.

ప్రక్కనే కూర్చుని కూరలు తరుగుతున్న తల్లి కామాక్షి, "నాలుగు రోజుల పాటు ఉండవే! ఇంతలో ఏంకొంప మునిగిందనీ!" అంది ప్రాథేయపూర్వకంగా, ఫోను పెట్టేస్తున్న సరళతో.

"ఉన్నాను కదమ్మా! ఇంకా వెళ్లక పోతే ఎలా? వెళ్లగానే పెద్దాడికి క్రికెట్ కోచింగు మొదలు పెట్టేస్తారు. రాజీ ఇప్పటికే వెళ్లి పోదామని గోల పెట్టేస్తున్నాడు. చంటిది కూడా ఏం తోచడం లేదంటోంది. ఆయనకీ నేను లేకపోతే సరిగ్గా గడవదు. ఏమీ చూసుకోలేరు" అంది సరళ.

"ఆఁ! నీ చాదస్తం లెస్తూ! ముందొచ్చిన చెవుల కంటె, వెనకొచ్చిన కొమ్ములు వాడి అన్నట్టు నువ్వుంటేనే గాని అతగాడికి గడవదా? మరీ వంటరిగా ఉంటున్నాడా ఏమన్నానా? కన్నతల్లి కంటే నువ్వే అతని ఎక్కువన్నట్టు మాట్లాడుతున్నావు. మరి కొన్నాళ్లుంటావేమో, పిల్లలకి నాలుగూ వండి పెడదామనుకున్నాను. వాడు 'మేగీ' చేసి పెట్టమంటున్నాడు. అదంటే పంచ ప్రాణాలూనూ వాడికి. చిన్నదానికి పాయసం ఇష్టం. తనివితీరా వీళ్లకి ఏ పిండి వంటలూ చేసి పెట్టనే లేదు. ఇట్టే నెల రోజులు తిరిగొచ్చాయి".

గంగానదిలా ఆగకుండా సాగే కామాక్షి వాక్ప్రవాహానికి ఒక్కమాటతో ఆనకట్ట వేసింది సరళ.

"అమ్మా! హైదరాబాదు మన ఇంటి వెనకాలే ఉంటే ఎప్పుడు పడితే అప్పుడు వచ్చి పోతూ ఉండొచ్చు. కానీ, నీతో చెప్పలేం – అసలే సమ్మర్ రష్. మళ్లీ రిజర్వేషను దొరుకుతుందో, దొరకదో అని వచ్చేటప్పుడే తిరుగు ప్రయాణానికి గౌతమిలో టిక్కట్లు రిజర్వు చేయించుకొచ్చాను. ఇప్పుడిది మార్చడానికి వీలుపడదు కానీ, ఆ పిండి వంటలేవో ఈ రెండ్రోజుల్లోనూ చేసి పెట్టుకో నీ మనవలకి".

అయినా కామాక్షి ఒకంతట సమాధానపడి ఊరుకునే రకం గాదు. "ఆ నీది మరీ విడ్డూరంలే! ఇలా వొచ్చావో లేదో తిరిగి ఎప్పుడు హైదరాబాదులో వాల్దామా అని ఆలోచిస్తూ ఉంటావు. నీ వొదిన గారే చూడు! పుట్టింటికెళ్లి నెల రోజులయిందా. ఇంతవరకు తిరిగి వచ్చే సూచనలేమీ లేవు. పైగా 'అత్తయ్య గారూ! మీరుండగా ఆయన కేం లోటు' అంటూ తియ్యగా నాలుగు మాటలాడి మరో వారం రోజులు కేంపు పెంచేస్తుంది. దానికి పుట్టింటికి పోతే ఒకంతట తిరిగి రావాలనుండదు. ఇక్కడ మొగుడూ, అత్తమామలూ ఏం పాట్లు పడుతున్నా సరే" అంది.

సమాధానంగా సరళ "అమ్మా నువ్వెన్ని చెప్పు, కమల లాంటి కోడలు దొరకడం నీ అదృష్టం. అసలామెకు నోట్లో నాలుక లేదు. ఎప్పుడేనా నీ మాటకి ఎదురు చెప్పిందా? వొదిన వచ్చాకే అన్నయ్య జీవితానికి ఓ తీరూ, తెన్నూ ఏర్పడ్డాయి. ఆమెనేమేనా అనుకుంటే మనకు పాపం!" అంది.

"సరేలే బడాయి. ఏమేనా అంటే దాన్ని వెనకేసు కొస్తావు. ఇంతకీ ఎల్లుండి నీ ప్రయాణం ఖాయమేనా?" అని సరళ నడిగి నిర్ధారించుకుని, ఆ సాయంత్రం భర్తకి, వరి పిండి, సెనగపిండి, మైదా వగైరాలకి ఇండెంటు పెట్టింది కామాక్షి.

ఆ రెండ్రోజులూ కామాక్షి వంటింటికి అంకితమై పోయింది. మధ్యాహ్నం రాత్రీ, భోజనాలయ్యాక, పొయ్యి మీద నూనె కాగబెట్టి, ఇన్ని పిండి ముద్దలు ముందు పడేసుకుని ఒకటే పిండి వంటలు. సాయం చేద్దామని సరళవస్తే "అత్తారింటికి వెళ్తే చాకిరీ ఎలాగూ తప్పదు. నీకెందుకే శ్రమ. పోయి కాస్త రెస్టు తీసుకో" అని దెబ్బలాడి వెనక్కి పంపేసింది.

ఎలాగైతేనేం కామాక్షి 'ఉస్సు, అస్సు' అంటూ



పడుతూ లేస్తూ ఓ డబ్బానిండా బూందీ లడ్డూలు, మరొక డబ్బా నిండా జంతికలు, కారప్పూసా, ఇంకా కొన్ని చిల్లర టిఫిన్లు వండడం పూర్తి చేసే సరికి సరళ వెళ్లేరోజు రానే వచ్చింది.

ఆ రోజున ఇన్ని తీసికెళ్తోంది కదా! ఇంకో చిన్న పేకెట్టు బరువవుతుందా అని ఆలోచించి,

'కడుపుచలవ' కని మరో డబ్బాడు చలిమిడి కూడా చేసి మూట కట్టింది కామాక్షి. ఆడపిల్ల ఇంట్లోంచి వెళ్తోంది కదా అని కిలో పసుపూ, కుంకం పొట్లాలు కట్టి ఇచ్చింది. ముందుగానే భర్తకి చెప్పి తెప్పించిన 'వురయూరు' చీరా, జాకెట్టు గుడ్డా బొట్టు పెట్టి ఇచ్చింది. సరళ ప్రయాణానికి ఆ చీర కట్టుకుంటే చూసి మురిసి పోయి, తన దిష్టే తగులుతుందేమోనని వ్రేళ్లు విరుచుకుంది. పిల్లలిద్దరి చేతుల్లోనూ చెరో వంద రూపాయలు పెట్టింది. ఉన్నట్టుండి ఏదో జ్ఞాపకం వచ్చినట్టు "నా మతి మండా! తొందర్లో మరిచే పోయేను" అని అర్జంటుగా వెళ్లి బీరువా తలుపుతీసి అయిదువేల రూపాయలు నోట్ల కట్ట తీసుకొచ్చి సరళ కందివ్వబోయింది.

సరళ చాలా ఆశ్చర్య పడుతూ "ఇదేమిటే అమ్మా! బట్టలు పెట్టేవు. పిల్లల చేతుల్లో డబ్బు పెట్టేవు. చేసింది చాలదా? ఇలా తీసుకోవడానికి నాకు చాలా మొహమాటంగా ఉంది" అంటూ తల్లిని వారించబోయింది.

అప్పుడు కామాక్షి సాధికారంగా సరళని హెచ్చరించి "చాల్లే మొద్దూ! ఒద్దనకు. ఆ మధ్య నాన్నకి కంపెనీ వాళ్లు బోనసు ఇచ్చారు. ఇది నీ కోసం దాచి పెట్టేను. తీసుకో. నా కంఠంలో నాలుగు ప్రాణాలూ ఉన్నంతకాలమే ఈ ముద్దుముచ్చట్లు. నేను కాస్తా గుటుక్కుమంటే నీకేసి చూసేవాళ్లుండరు. ఈ మొగాళ్లు వాళ్ల ఆస్తులు పంచుకోడానికే దెబ్బలాడుకు చస్తారు. ఆడ పిల్లల్ని ఆ సమయంలో జ్ఞాపకం చేసుకునేదెవరు? నా మాట విని ఇది నువ్వు ఖర్చు పెట్టుకో" అని కళ్ల నీళ్లు పెట్టుకుంది.

"అది కాదమ్మా! ఇప్పుడు దీని అవసరం ఏమిటి? అవసరం వొచ్చినప్పుడు నేనెప్పుడైనా కావాలంటే నాన్న కాదంటాడా? అన్నయ్య నడిగితే ఇవ్వడా? ఇంకా ఈ రోజుల్లో ఆడా, మగా తేడాలేమిటి? అంతా ఒక్కటే. ఆడది ఉద్యోగం చేసి జీతం తెస్తే, అది కుటుంబంలో అంతా తింటున్నారు కదా!" అని సర్దిచెప్పబోయింది సరళ.

"నువ్వింకా జీవితాన్ని తరచి చూడలేదే పిల్లా! సంపాదించడానికి ఆడా మగా లేక పోయినా ఆస్తులు పంచుకునేదగ్గర మాత్రం ఆడది ఆడదే! నువ్వు ఊహించుకుంటున్న ఆ రోజు ఈ రోజే రావాలని నా ఆశ. అది నువ్వు కూడా చూడలేవేమో అని నా నిరాశ. డబ్బూ, ఆస్తుల దగ్గర కొచ్చే సరికి బంధుత్వాలూ, అభిమానాలూ ఆవిరై పోతాయి. స్వార్థం కరడు గట్టుకుపోతుంది. నా పుట్టింటి నుంచి నేనేం తెచ్చానో నాకే తెలుసు. అదంతా ఇప్పుడెందుకు కానీ నా మాట విని ఇది నీదగ్గర పెట్టుకో!" అని బలవంతాన నోట్ల కట్ట కూతురి చేతిలో నొక్కి పెట్టింది కామాక్షి.

ఇక వాదన అనవసరం అని సరళ ఆ డబ్బు తీసుకుని హాండ్ బ్యాగ్‌లో జిప్ పాకెట్‌లో జాగ్రత్తగా పెట్టుకుంది.

సాయంత్రం రైలుకి బయల్దేరేవేళకి అనుకున్నదానికంటె ఎక్కువే సామాను తయారైంది. సరళ తనతో తెచ్చుకున్న రెండు విఐపి సూటు కేసుల మధ్య, పిండి వంటల మూటలు, ఇద్దరు ఫ్యాషన్ మోడల్సు మధ్య నిలబడ్డ పల్లెటూరి పిల్లల్లా మెరిసి పోతున్నాయి.

సమయం దగ్గర కాగానే చినబాబు వెళ్లి రెండు ఆటోలు తీసుకొచ్చాడు. సరళా పిల్లలు ఒక రిక్షాలోనూ సామానూ, కామాక్షీ, చినబాబు మరో ఆటోలోనూ సర్దుకున్నారు. స్లీపరులో సామానంతా చేరవేశాక, ఇక రైలు బయలుదేరుతుందనగా సరళ కూర్చున్న సీటు కిటికీ దగ్గరకొచ్చి "జాగ్రత్తగా వెళ్లిరా అమ్మా! పిల్లల్ని జాగ్రత్తగా చూసుకో! క్షేమంగా చేరగానే ఫోను చెయ్యి!" అని చెప్పుతూ గుండెల్లోంచి దుఃఖం ఉబికి వస్తుండగా మరోసారి కళ్ల నీళ్లు పెట్టుకుంది కామాక్షి. ఆ సమయంలో అమ్మమ్మ ఎందుకలా ఏడుస్తోందో అర్థం కాక అలా చూస్తూ ఉండి పోయారు పిల్లలిద్దరూ.

ఇంటికి తిరిగొచ్చిన కామాక్షి ఉదాసీనంగా టెలిఫోను టేబిలు ముందున్న కుర్చీ మీద కూలబడింది.

అది గమనించిన భర్త "ఏమిటోయ్ అప్పుడే టెలిఫోను దగ్గర తిష్టవేశావు. ఇంకా రైలు పొలిమేర దాటలేదు. అది హైదరాబాద్ చేరాలి. వాళ్లు ఇంటికి వెళ్లాలి. అప్పుడు కదా నీకు ఫోను వచ్చేది" అని కామాక్షిని ఎద్దేవా చేశాడు.

"సర్లెండి. వేళాకోళానికైనా వేళాపాళా ఉండాలి. మనసు బాగో లేక యథాలాపంగా వచ్చి అలా కూర్చుండి పోయాను. అంతే! ఏ పాటు తప్పినా సాపాటు తప్పదు కదా!" అంటూ వంటింటిలోకి నడవబోయింది.

ఇంతలో ఫోను ట్రింగ్.... ట్రింగ్ అంటూ మ్రోగింది. "హల్లో!" అని ఆc! చెప్పమ్మా!... సరే... అలాగేరా!.... అన్నీ జాగ్రత్తగా చూసుకో.... పిల్లలు జాగ్రత్త" అని పెట్టేసింది కామాక్షి.

"ఎవరిదీ ఫోను?" అడగనే అడిగాడు భర్త.

"ఇంకెవరూ? మీ కోడలు కమల. మహారాణి నెలరోజులై వెళ్లింది గదా! ఆదివారం నాటికి చేరుకునేలా టిక్కట్టు కొనుక్కుందిట. ఆదివారం అంటే ఇంకా నాల్రోజులు ఉంది. అప్పటిదాకా నాకీ చాకిరీ తప్పదు కదా! వచ్చే ముందు మళ్లీ ఫోను చేస్తానని మరిప్పుడెందుకు చేసినట్టో!" అని గొణుక్కుంటూ వెళ్లిపోయింది కామాక్షి.

వెళ్లిన మూడో రోజున వచ్చింది సరళ దగ్గర్నుంచి ఫోను. కామాక్షి చేటంత ముఖం చేసుకుని "ఇన్నాళ్లకిటే ఫోను చేయడం. చేరుకోగానే చెయ్యొద్దూ? అని చీవాట్లు పెట్టింది కూతుర్ని ఆ తరువాత ఇరవై నిముషాల సేపు మాట్లాడింది.

"ఆc! అదేంటే? ఆశ్చర్యం! అప్పుడే అయిపోయాయా. నిన్ను వారం రోజుల పాటు దాచుకుని తినమన్నానా! వాళ్లకి సిగ్గూ శరమూ ఉండనక్కర్లా! అయినా వాళ్లనని ఏం లాభం. ఆ బుద్ధి నీకుండాలి. సర్లే, నీ తెలివి తెల్లారినట్టే ఉంది. మంచి మాటలతో నిన్ను బోర్లా పడగొట్టారే వెర్రి మొహమా! తెలుసుకోలేకపోయేవు. సర్లే ఇంక చేసేదేముంది?'' అని పెట్టేసి మొహాం వేలాడేసుక్కూచుంది.

ప్రక్కనే కూర్చుని అన్నీ వింటున్న కామాక్షి భర్తకి ఆ మాట్లాడింది కూతురు సరళేనని అర్థం అయింది. కాని పూర్తి సంభాషణ తెలియక అంతా తికమకగా అనిపించి "ఏమయిందేమిటి? కన్న కూతుర్నే కూకలేస్తున్నావు?" అని అడిగారు.

"చూశారా! చూశారా! అదీ పిల్లలూ వారం రోజుల పాటు తింటారు గదా అని అన్ని పిండి వంటలు పొయ్యి దగ్గర్నుంచి కదలకుండా చేసి

## ఏప్రిల్ ఫూల్!

జీతం అందింది
అప్పులే మిగిలేయి
ఏప్రిల్ ఫూల్!

ఉద్యోగం కోసం
నంబరు రానేలేదు
ఏప్రిల్ ఫూల్!

పంట పండింది
తుపాను మింగేసింది
ఏప్రిల్ ఫూల్!

విద్యార్థి కృషి
లీకయింది పేపరు
ఏప్రిల్ ఫూల్!

అయిదు ఏళ్ళు
తిరగేసిన కథ
ఏప్రిల్ ఫూల్!

అపార్టుమెంట్లు
ప్రక్కనెవరున్నారో
ఏప్రిల్ ఫూల్!

రైలు కూసింది
ప్రమాదం లేదు కదా
ఏప్రిల్ ఫూల్!

బడ్జెట్ పర్వం
సామాన్యుని కళ్ళలో
ఏప్రిల్ ఫూల్!

ఎన్నికలలో
డిపాజిట్ గల్లంతు
ఏప్రిల్ ఫూల్!

–గుడిమెట్ల గోపాలకృష్ణ

దానికిచ్చి పంపానా! ఇలా వెళ్లిందో లేదో ఇంటిల్లిపాదీ బెల్లం చుట్టూ చీమల్లా ఆ డబ్బాలు పట్టుకుని వదల్లేదుట. పిల్లలంటే పోనీ అర్థం ఉంది. మరీ అత్తగారూ, మామగారు కూడా హవ్వ! బుద్ధి ఉండక్కర్లా? ఏళ్లు రాగానే సరా. తిండికి మొహం వాచి పోయినట్టు. 'చాలా బాగున్నాయే! కారప్పూస భలే పసందుగా ఉందనుకో. బూందీ మిఠాయి మీ అమ్మ చేసినట్టుగా మరెవరూ చేయలేరు! అంటూ ఈ రెండు రోజుల్లోనూ అన్నీ ఊది పారేశారుట. కడుపా! వీళ్లది ఖండవల్లి మడుగా? అవును! ఏలకులు, జీడిపప్పు, కిస్‌మిస్సు, పిసరంత పచ్చ కర్పూరం తగుపాళ్లలో వేసి తయారుచేస్తే మిఠాయి మహా పసందుగా ఉండదూ! దాని మరిదికి కారప్పూస, జంతికలూ అంటే ప్రాణంట! కాలేజికి కూడా అవే తీసికెళ్లి టిఫిను క్రింద తినేశాడట! అయినా వాళ్లనని ఏం లాభం. మన భ్రాజిమానం వాళ్ళ పొగడ్తల్లో పడిపోయి, పట్టుకెళ్లిన మూటలన్నీ వాళ్ల ముందు విప్పేసి, ఇంకా తినండి, ఇంకా తినండి అని అప్పగించేస్తే, ఆరగించేయడం వాళ్ల తప్పా?" అని పొంగి వస్తున్న దుఃఖాన్ని ఆపుచేయడానికి వ్యర్థప్రయత్నం చేస్తూ ముక్కు చీదేసింది.

ఆ తరువాత ఆదివారం వచ్చింది. ఆరోజు కోడలు కమల వచ్చే రోజు. ప్రొద్దుటి నుంచీ కామాక్షి వంట్లో నలతగా ఉంది. అసలు మంచం మీంచి లేవడమే ఆలస్యంగా లేచింది. పనులన్నీ బద్ధకంగా చేస్తోంది. అంత ముఖ్యం కాని వాటిని 'కమల వచ్చి చూసుకుంటుందిలే' అని వదిలి పెట్టేస్తోంది.

సాయంత్రం వేళప్పుడు చినబాబు జ్ఞాపకం చేశాడు ఇంట్లో "ఇవాళ సాయంత్రం వొదిన వస్తోంది కదా! స్టేషనుకెళ్లాలా?" అని

"ఎందుకు? ఈ ఊరు దానికి క్రొత్త కాదు గదా! రైలు దిగి ఆటోలో ఇంటికి రావడానికి మరొకళ్ళ సాయం ఎందుకు? వచ్చేస్తుందిలే!" అంది కామాక్షి.

"అదేంటే? రైలు వచ్చేసరికి బాగా చీకటి పడిపోతుంది. ఈ రోజుల్లో అవి టైముకొచ్చి చస్తున్నాయా? ఇద్దరు పిల్లలతో, సామానుతో వస్తుంది. ఒద్దంటావేం? అన్నయ్యకు కుదరదు కానీ, స్టేషనుకి నువ్వెళ్లు రా చినబాబూ," అని ఆర్డరు వేశాడు తండ్రి. కామాక్షి ఇంకేమీ మాట్లాడలేదు.

గంట లేటుగా వచ్చిన రైలుబండి నుంచి బండెడు సామానుతో దిగిన కమలకి మరిదిని చూడగానే ప్రాణం లేచి వచ్చింది. పిల్లలిద్దరూ చిన్నాన్నని కౌగలించుకుని చంకల కెక్కేశారు. రిక్షా మాట్లాడుకుని ఇంటికి చేరుకునేసరికి రాత్రి తొమ్మిదయింది. రైలు ప్రయాణం మట్టి వదిలించుకునేందుకు స్నానాలు ముగించే సరికి పది గంటలయింది.

ఈలోగా వచ్చిన మూటల్లో సగానికి పైగా విప్పి కోడలేమేమి తెచ్చిందో అని పరీక్ష చేసింది కామాక్షి. పచ్చ ఆవకాయ, తొక్కుడు పచ్చడే కాకుండా, కమల తూర్పు ఆవకాయ, కంది పొడీ కూడా తెచ్చింది. కోడలు స్నానాల గదిలోంచి బైటికి రాగానే "కమలా ఇవాళ్ల అన్నం మాత్రం కుక్కర్‌లో పడేయ్. ఇంక కూరలేం వండుకోవద్దు. మీ మామ గారికి తూర్పు ఆవకాయ మహాయిష్టం. నేను తొక్కుడు పచ్చడి తింటా. కందిపొడి ఇంట్లో అందరికీ ప్రాణం. తోడు పెట్టిన పెరుగు ఉండనే ఉంది. పెద్దాడు, చినబాబు కూడా మడత కాజాలు చాలా ఇష్టంగా తింటారు. మా వియ్యపురాలు చేసిన కాజాలు చక్కగా తేనెలూరుతూ భలే మజాగా ఉంటాయి. ఏమండీ! చూశారా! మీ కోసం కోడలు ప్రత్యేకంగా ఆవకాయ తెచ్చింది. మీరంటూ ఉంటారు కదా, ఈ తూర్పు ఆవకాయ పెచ్చు తిన్నకొద్దీ రుచులూరుతుందని" చెప్పుకు పోతోంది. కామాక్షి ఆ ప్రవాహానికెవరూ ఆనకట్ట కట్టలేరు. పిల్లలిద్దరూ బామ్మ దగ్గర చేరి ఒళ్లో వాలారు. కమల చిన్నగా నిట్టూర్చి వంటింట్లోకి వెళ్లి కుక్కరు కోసం వెదుకుతోంది. ■